# అమ్మాయిలూ జాగ్రత్త!

'శమైతాంగి'

"అమ్మాయీ! ఏ వూరు వెళ్తావు"? అడిగింది ఎదురు బెర్త్ మీద కూర్చున్న కళ్ళజోడామె, కిటికీలోంచి బయటకు చూస్తున్న అమ్మాయి నుద్దేశించి. ఆ అమ్మాయి తల తిప్పి ఆమె వైపు 'నేను ఏ వూరు వెళ్తే నీకెందుకూ' అనే భావంతో నిర్లక్ష్యంగా చూసి తిరిగి బైటకు చూడసాగింది.

ఆ అమ్మాయి ముఖంలో స్పష్టమైన భావాన్ని అవగాహన చేసుకున్న ఆమెకు ఆ అమ్మాయి గురించి తప్పకుండా అడిగి తెలుసుకోవాలనే పట్టుదల బైలు దేరగా, కావాలనే సంభాషణ పెంచింది—"ఎక్కడికి విజయనగరమా—అక్కడెవరన్నా బంధువులున్నారా? చదువుకుంటున్నావా? ఉద్యోగం చేస్తున్నావా? ఎంత వరకు చదువుకున్నావు?" అంటూ—

తనివితీరని ఆమె అడుగుతుంటే ఆ అమ్మాయికి ఆమె మీద పీకదాకా కోపం పొంగుకొస్తున్నది, 'నీకెవరూ దొరకలేదా తల్లీ కాలక్షేపానికి నా ప్రాణాల కొచ్చావు'—లోలోపల మండిపడినా, పైకి ప్రశాంత భావాన్ని చూపిస్తూ "విజయనగరం కాదు. విశాఖ పట్నం వెళ్తున్నాము" అంది చివరకు. ఆమె మళ్ళీ మళ్ళీ రెట్టించి అడక్కుండా, అక్కడ ఉంటున్న ఒక స్నేహితురాలి దగ్గరకు వెళ్తున్నట్టు, చదువుకుంటు న్నట్టు చెప్పింది.

"అలాగా. అయితే మేమూ వైజాగే వెళ్తున్నాము, అంతవరకూ నాకు సాయంగా ఉంటావన్నమాట' అందామె నవ్వుతూ.

'నేను నీకేం సాయం ఉంటాను, స్టేషన్లో దిగిన తర్వాత నువ్వెవరివో, నేనెవరినో—నాకూ నీకూ సంబంధం ఏమిటి' అనుకున్నా ఆ అమ్మాయి పైకి ఏమీ అనలేదు. తనూ నవ్వి వూరుకుంది.

ఆ అమ్మాయికి సుమారుగా పద్దెనిమిది ఏళ్ళు ఉంటాయేమో, తెల్లగా అందంగా నాజూగ్గా ఉంది. చెవులకు పెద్ద పెద్ద రింగులు పెట్టుకుంది. మెడ, చేతులు బోసిగా ఉన్నాయి. ఒంటి మీద ఖరీదుగల చీర ఉంది. ఆ అమ్మాయినే పరిశీలనగా చూస్తున్న ఆమె హఠాత్తుగా అడిగింది "నీ సామాను ఎక్కడ పెట్టావు" అని.

"నా సామానంతా ఇదేను." చేతిలో ఉన్న పుస్తకాన్ని చూపింది ఆ అమ్మాయి.

"అయితే అక్కడ ఎక్కువ రోజులు ఉండవు కాబోలు.." ఆమె మాటకి మౌనమే జవాబుగా వూరుకుంది అమ్మాయి.

ఏదో స్టేషన్ రాబోతున్న సూచనగా ట్రెయిన్ వేగం తగ్గింది. ఆ స్టేషన్‌లో అరటిపళ్ళు కొని తను రెండు తీసుకుని, ఆ అమ్మాయికి రెండు ఇవ్వ బోయింది ఆమె. ఆమె నడివయసులో ఉంది. వయసులో ఉన్నప్పుడు అందంగా ఉండేది అనే సూచనగా ఆమె ముఖంలో, శరీరపు వంపు సొంపుల్లో సౌందర్య లక్షణాలు ప్రస్ఫుటమవుతున్నవి. కట్టుకున్నది వెంకట గిరి నేత చీరే అయినా ఆ చీరలో ఆమె హుందాగా కనిపిస్తున్నది.

మెడమీదకు జారినట్లు చుట్టుకున్న ముడి, మెడలో ఒంటిపేట గొలుసు, చేతులకు రెండేసి బంగారు గాజులు, కళ్ళకు ఖరీదుగల ఫ్రేముతో ఉన్న అద్దాలు—ఇది సింపుల్‌గా ఆమె ఆకార విశేషాలు. ఆమె ఇవ్వబోతున్న అరటి పళ్ళను ఆ అమ్మాయి తీసుకోలేదు.

"వద్దండీ, నేను అరటిపళ్ళు తినను" అంటూ సున్నితంగా తిరస్కరించింది.

"అయితే నేనూ తినవులేమ్మా." ఆమె చేతిలో ఉన్న పళ్ళను ప్లాస్టిక్ బుట్టలో పెట్టబోయింది.

"మీతో చాలా చిక్కు వచ్చిందే. సరే ఒక పండు ఇవ్వండి" అని. ఆమె ఇచ్చేలోపలే ఆమె చేతిలో ఉన్న అరటి పండుని లాక్కుని గబగబా తినేసింది అమ్మాయి.

నవ్వుతూ "అదీ అలా ఉండాలి అమ్మాయిలంటే. నీ పేరేమిటన్నావు?" అందామె.

'నా బొంద అన్నాను' లోలోపల రగులుకుంటున్న కోపాన్ని, చిరాకునీ అణచుకుంటూ "నా పేరు... నా పేరు.. బిందు మాధవి" అంది అమ్మాయి.

"నీలాగే నీ పేరు కూడా అందంగా ఉంది, అమ్మాయీ! మనిషి ఎలా ఉన్నా పేరు మాత్రం మంచి దుండాలి అనే వాళ్ళతో ఏకీభవిస్తాను. నా పేరు చూడు మంగతాయారు. కొందరు మంగా అని పిలిస్తే మరి కొందరు తాయారూ అంటారు.." అంటూ ఆగి ఆ అమ్మాయి వైపు చూసింది.

అమ్మాయి తను చెప్పే మాటలు వింటే కదా "ఓహో.. అలాగా' అనడానికి? ఆ అమ్మాయి తన చేతిలో ఉన్న పుస్తకాన్ని ఏకదీక్షగా చదవడంలో లీనమయ్యింది. తనతో మాట్లాడడం ఆ అమ్మాయికే ఇష్టం లేనట్లు గ్రహించిన మనను, తిరిగి ఆమెను పలకరించలేదు. తనూ మౌనంగా ఉండిపోయింది.

ట్రెయిన్ తిరిగి బయలుదేరి వేగాన్ని పుంజు కుంది. ఆ అమ్మాయి చేతిలోని పుస్తకాన్ని తన స్థానంలో ఉంచి లావెట్రీలోకి వెళ్ళింది. ఈ అవకాశాన్ని పోనివ్వకుండా ఆ అమ్మాయి అక్కడ మిగిలిన పుస్తకాన్ని తీసి, పేరు చూసి పుస్తకాన్ని తిరగేసింది ఆమె. అలా తిర గేస్తుంటే ఆ పుస్తకంలో నుంచి కొన్ని రూపాయి నోట్లు, పోస్టు చేయని కవరూ కిందపడ్డాయి. రూపాయి నోట్లను తిరిగి పుస్తకంలో పెట్టేస్తు కవరు తీసుకుని తన హాండ్‌బాగ్‌లో పెట్టుకుని తిరిగి ఆ పుస్తకాన్ని దాని స్థానంలో పెట్టేసింది.

ఆ అమ్మాయి ముఖం తుడుచుకుంటూ వచ్చింది.

"తల దువ్వుకుంటావా? పౌడరు అద్దుకుంటావా?" అని అడిగి ఆ అమ్మాయి మొఖం చిట్లిస్తుంటే నోరు మూసుకుని ఒక క్షణం ఆగి "లావెట్రీకి వెళ్ళి వస్తాను నా సామాను చూస్తుండమ్మాయి" అని ఆ అమ్మాయి సమాధానం కోసం చూడకుండా లేచి లావెట్రీకి వెళ్ళి పోయిందామె, చేతిలోని వానిటి బాగ్‌తో సహా.

'పీడ వదిలింది' అనుకుంటూ అమ్మాయి గాఢంగా నిట్టూర్చింది. 'వచ్చేది వాల్తేరేనా బాబూ?" ఒక వృద్ధురాలు ఎదురుగా ఉన్న కుర్రాడిని అడుగు తున్నది.

"అవును" అన్నాడు కుర్రాడు క్లుప్తంగా. ఆ వృద్ధురాలు హడావుడిగా లేచి తన సామాను సర్దుకోసాగింది.

"ఈ రోజు బండి చాలా లేటుగా వెళుతున్నది, ఆరింటికి వాల్తేరులో ఉండాలిసిన బండి ఇప్పుడే ఎనిమిదవుతున్నది" అంటున్నారెవరో. ఈ రోజుల్లో ట్రెయిన్లు లేటుగా చేరడం సర్వసాధారణమై పోయింది, అలాగే యాక్సిడెంట్లు కూడా అలవాటు పడిపోయారు ప్రజలు" తన ఆవేదనను, అందో ళనను వ్యక్తం చేస్తున్నారెవరో. కళ్ళజోడు మంగ తాయారుగారు వచ్చారు.

ట్రెయిన్ ఆగింది. తన సూట్‌కేసు, ప్లాస్టిక్ వైర్ల బుట్టను చేతిలోకి తీసుకుంటూ—"మన స్టేషన్ వచ్చేసింది నువ్వు దిగవా అమ్మాయ్?" అందామె అమ్మాయివేపు చూస్తూ.

ఆ అమ్మాయి మాట్లాడకుండా లేచి ప్లాట్ ఫారం మీదకు దిగింది. ఆమె వెనకాలే దిగింది మంగతాయారు గారు.

"ఎవరన్నా వస్తారా? వచ్చారా నిన్ను రిసీవ్ చేసుకోవడానికి?" అడిగిందామె.

"ఎవరున్నారని వస్తారు?" మనసులో గొణు క్కున్న అమ్మాయి పైకి నిర్లిప్తంగా నవ్వుతూ 'ఊహూ ఎవరూ రారండీ" అంది చిన్నగా.

"అయితే ఇంత రాత్రివేళ ఒక్కర్తివీ వెళ్తావా?" ఆమె కళ్ళు విస్మయంగా విప్పుకున్నాయి. ఒకవేళ

...నువ్వు వెళతావన్నా వెళ్ళనివ్వను సుమా' అనే భావం చూపిస్తూ.

"నాకేం భయం? ఇంకా ఎనిమిదన్నా కాలేదు కదా?"

"అయితే మాత్రం, నాలుగు రోజుల క్రితం ఒక అమ్మాయి ఇలాగే ఒంటరిగా చూసి ఎత్తుకు పోయారట పది మంది కుర్రాళ్ళు. ఆ తర్వాత రోడ్డు వార స్పృహ లేని స్థితిలో పడి ఉంటే చూశారు అందరూ."


ఆ మాట విన్న అమ్మాయికి గుండె జల్లుమంది 'ఒక్కసారిగా. ' అమ్మో! అటువంటి హీనస్థితే' అనుకుంది పిరికిగా.

"ఈ ఆటో డ్రైవర్లూ, రిక్షావాళ్ళూ నమ్మ కూడదమ్మాయ్! నీలాంటి అందమైన అమ్మాయి ని నిర్లక్ష్యంగా తీసుకుపోయి, కంపెనీలకు, లాడ్జింగులకు అమ్మేస్తుంటారు. తర్వాత నీ భ్రష్టం, నీ ఖర్మ." ఆమె ఒక రిక్షా మాట్లాడుకుని దాన్లో ఎక్కి కూర్చుంది.

అమ్మాయి కాస్సేపు ఆలోచించి, చటుక్కున అంది "చూడండి నన్ను కూడా మీతో తీసుకెళ్ళండి"

"మంచిది ఇలా వచ్చి కూర్చోమ్మా" అంటూ తను జరిగి ఆ అమ్మాయికి చోటు చూపెట్టింది, రిక్షా కదిలింది.

"నిన్ను చూస్తుంటే మా చెల్లెలు రోహిణి గుర్తు



వస్తున్నది" అందామె. "ఆమె ఏం చేస్తున్నారు?" కుతూహలంగా అడిగింది అమ్మాయి. "ఏం చేస్తున్నదో నాకు తెలిస్తే కదా నీకు చెప్పడానికి?" ఆమె గొంతులో దుఃఖం చాయలు ప్రస్ఫుటమయ్యాయి.

"మరి..?" సందేహంగా చూసింది అమ్మాయి ఆమె వైపు — "చెల్లెలంటున్నావు, తెలియదంటున్నావు" అన్నట్లు.

"ఏమయ్యింది? అది నా అనుమానం కదూ! నీలాగే అందంగా ఉండేది, నీలాగే వయసులో ఉండేది, నిర్లక్ష్యంగా పొగరుగా ఉండేది. దాని పొగరు చూసి అమ్మా, నాన్నా ముచ్చటపడేవారే గాని, మందలించే వారు గారు. ఆ అలుసు చూసుకుని అది మరింత పేట్రేగిపోయింది. మరింత పెంకిగా తయారయ్యింది. దానిని డాక్టరమ్మ చేయాలని నాన్నగారి ఆశ, కాని అది చదువుని నిర్లక్ష్యం చేసి సినిమాలు, షికార్లూ అంటూ తిరిగింది, పరీక్ష పోయింది..." ఆమె చెప్పడం ఆపి విషాదంగా నిట్టూర్చింది.

## "ఆత్మ ఘోష"

లోకం చీకటి అనకు నేస్తం!

హృదయంలో క్రొవ్వొత్తి వెలిగించు
అంధకారం పటాపంచలవుతుంది.
అన్యాయాల్ని అణుస్తోని అనకు
మాటకీ చేతకీ భేదం వుంది
పరిస్థితులకు లొంగిపోయి పోకు
అందరాని ఫలాలు పుష్కలంగా
అందిన వన్నీ తియ్యగా
ఉంటాయన్నది అసత్యం; కన్న
కలలో జరిగిన వన్నీ శాశ్వతమని
విశ్వంలో జరిగే సత్యాలు కలలనీ
కలిసి లేమి కావడకుండదని
మూలిగిపోకు, భ్రమించకు, చలించకు,
హృదయంలో ఆలోచించు కళ్ళు మూసి
నీలో నీ వాలోచించు దీర్ఘంగా
ఏది సత్యం, ఏది ధర్మం, న్యాయం.
ఎందుకు జన్మించావు, దేనికి జీవించాలి.
కళ్ళు మూసి కళ్ళు తెరువు !!
కనబడుతుంది విశ్వం, సంఘం
పొరుగు వచ్చి ఓర్వని సంఘం-
స్వార్థం కుళ్ళు పెరిగే సంఘాన్ని
ఎదుర్కోడానికి అశక్తుడనకు
ఔ! క్రొవ్వొత్తి వెల్గించు. ఔ! !
ఆ దీపకళిక చాలు, కాంతిపుంజానికి
ఆ కూపంలో. . .
శోకిస్తున్నారు, ఎన్నో బాధాకంటకాలు
ఎన్నో దైన్యాలు. . .హైన్యాలు
జీవిస్తున్నారు గూడు పట్టు కదలిన శవాలు
భయపడి పారిపోకు, వెలికి తీయి
మానవత్వానికి జీవం పోయి
ఇంకా ఆ కూపంలోనే
పోరాడుతున్నారు పడగ ఎత్తిన నాగులు
పొంగిలుతున్నారు పయోముఖ విషకుంభాలు
పోరాడుతున్నారు తేనె పూసిన కత్తులు
ధైర్యంతో వాటిని నాశనం చేయి
ఏమీ చేయలేని నీవు జీవచ్ఛవానివి
బ్రతికి ఉన్నప్పుడే మంచి పని చేయి.

-వేమకోటి

"వెళ్ళిపోయిందా? ఎక్కడికి? ఇప్పుడెక్కడ ఉంది?" అమ్మాయి ఆత్రుతగా అడిగింది.

"అదిగో అక్కడికి వెళ్ళిపోయింది." ఆమె చెయ్యి పైకెత్తి ఆకాశంలోకి చూపెట్టింది.

"అంటే చచ్చిపోయిందా?" అమ్మాయి ముఖం భయంతో బిగిసి పోయింది.

"అవును అతి దారుణంగా. ఇక్కడ చచ్చిపోతే నాన్నగారికి అప్రదిష్ట అని ఎక్కడికో గుర్తులేని చోటుకు వెళ్ళి చచ్చిపోవాలనుకుంది. కాని దాని దురదృష్టం అది ఒక కంపెనీ మనిషి చేతిలో పడింది. అక్కడ మెల్లగా తప్పించుకోవాలని ఎన్నో రకాలుగా ప్రయత్నించింది. ఎంతమందినో వేడుకుంది—ఆ నరకం నుంచి తనను తప్పించమని.

"అర్ధరాత్రి ఆ ఇంటి చుట్టూ కాపలా తిరిగే గూండా చేతుల నుంచి ఆమెను ఎవరు మాత్రం రక్షించి కాపాడగలరు? వాళ్ళ గొడవ మధ్య మందీ తప్పించుకుని ఈ విశాల ప్రపంచంలో కాలు పెట్టిన ఆడదానికి ఎటువంటి రక్షణా దొరక లేదమ్మాయీ! అందుకే నీ లాంటి అమ్మాయిలను చూస్తుంటే మా రోహిణి గుర్తొస్తుంది. దాని లాగే మీలా నరకంలో చిక్కుకు పోతారేమో అని భయపడుతుంటాము. వయసులో ఉన్న మా ఆడ పిల్లలకు తొందర పాటెక్కువ, ఆలోచన తక్కువ. అందుకే కోరి చిక్కులు తెచ్చుకుంటారు' ఆమె చెప్పడం ముగించింది.

'మా అమ్మాయిల కోసం పేపర్లో ఎలాగూ ఒక ప్రకటన వేయించాలని అనుకుంటున్నాను.'

"ప్రకటనా? ఏమని?" అమ్మాయి కుతూహలంగా అడిగింది.

"ఏమనా?" నవ్విందామె. "అమ్మాయిలూ, జాగ్రత్త. ఆవేశంతో తొందర పడకండి. ఆగండి ఆలోచించండి—ఇల్లు వదిలి, రక్షణ లేని విశాల ప్రపంచంలో అడుగు పెట్టకండి ఇక్కట్లు పాలౌతారు' అని. ఎలా ఉంది నా ఐడియా?"

అమ్మాయి మాట్లాడ లేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూండి పోయింది.

రిక్షా ఒక డాబా ఇంటి ముందు ఆగింది. ఆమె వెనకాలే ఇంట్లోకి నడిచింది అమ్మాయి.

"ఆంటీ వచ్చింది, ఆంటీ వచ్చింది" అంటూ అయిదారుగురు అమ్మాయిలు కిలకిల్లాడుతూ, వచ్చి ఆమెను చుట్టేశారు. ఆమె వెనగ్గా నిలుచున్న అమ్మాయిని చూస్తూనే 'ఎవరీ అమ్మాయి? మీకు ఎలా దొరికింది?' అన్నట్లు చూడసాగారు.

'మాస్టారు లేరా? ఎక్కడికి వెళ్ళారు? వేన్నీళ్ళు ఉన్నాయా? చాలా చిరాగ్గా ఉంది. స్నానం చేస్తాం. తినడానికి ఏమైనా ఉందా? లేకపోతే వద్దులే. ఈ అమ్మాయికి బాత్‌రూమ్ చూపించు సరళా. . . వెళ్ళి స్నానం చేసి రా. అమ్మాయీ! ప్రయాణపు బడలిక అంతా పోతుంది' గలగల మంటూ అందరికీ ఆదేశాలిచ్చి తను మరో గదిలోకి వెళ్ళి పోయిందామె.

ఇప్పుడు స్నానం ఏమిటి? అదీగాక బట్టలు మార్చుకోవడానికి ఎలా వీలౌతుంది? తనకు స్నానం చేయడం ఇష్టం లేనట్లు తేలింది అమ్మాయి.

"నా బట్టలు కట్టుకో" అని ఒకరు 'నావి కట్టుకో' అని ఒకరు పోటీ పడుతూ ఉంటే, ఇంకొకరు "చప్పున స్నానం చేసి రాకపోతే ఆంటీకి కోపం వస్తుంది" అంది నవ్వుతూ.

ఒకామె అందించిన బట్టలు పట్టుకుని, అయిష్టంగానే బాత్ రూమ్ వైపు వెళ్ళింది ఆ అమ్మాయి.

"నీ పేరు? ఎంత వరకు చదువుకున్నావు?" అడిగింది కూడా వచ్చి నామె. ఆమె వయసు పాతిక లోపుగా ఉంటాయి.

"నా పేరు మాధవి!" చెప్పింది అమ్మాయి కాని తనెంతవరకు చదివిందీ చెప్పలేదు.

"అవునా అంటే నీ కెలా తెలుసు? ఇంట్లోంచి పారిపోయి వచ్చావా? అటువంటి అమ్మాయిల్నే పట్టుకుంటుంది ఆంటీ." గడుసుగా నవ్వింది. ఆ మాట వింటూనే ఉలిక్కి పడింది మాధవి. ఆమె ముఖం భయంతో వివర్ణమైంది. తడబడుతూ అంది.

"పారిపోయి వచ్చానా? చ. . . అదేమీ కాదు. రాత్రి పూట ఒంటరిగా వెళ్ళలేక ఇక్కడికి వచ్చాను. తెల్లవారుతూనే వెళ్ళి పోతాను" అంది మాధవి జవాబుగా.

ఆ అమ్మాయి స్నానం చేసి వచ్చే వరకూ ఆమె అక్కడే ఉంది నిరీక్షిస్తూ.

"అవునా ఇందాక పారిపోయి వచ్చావా— అని అడిగారు. మీ రంతా అలాగే పారిపోయి ఈవిడ చేతిలో పడ్డారా?' అడిగింది మాధవి.

"ఒక రకంగా అలా పడిన వాళ్ళమే మేమంతా! వయసు ఉద్రేకంతో కాలు జారి విధి వంచితుల మైన మేము సిగ్గూ, అవమానాలతో బయటి ప్రపంచం చూడలేక ఇల్లు విడిచి వచ్చిన మాకు ఆశ్రయమిచ్చి, బతుకు మీద ఆశను పెంచి మాకు బతకడానికి ఒక ఆధారం కల్పించి, దయతో, ప్రేమతో, వాత్సల్యంతో మమ్మల్ని చూస్తుంది ఆంటీ. ఆంటీ లాంటి మంచి వ్యక్తులు కోటికి ఒకరు ఉంటారేమో ఇంత మంచి వ్యక్తికి ఏమిచ్చినా, ఏం చేసినా ఆ ఋణం తీరేది కాదు అని నా అభిప్రాయం". ఆమె ఆగింది అలుపు తీర్చుకోవడం కోసం.

"ఇక్కడ మీరు ఏం చేస్తుంటారు?"

"ఎవరికేది ఇష్టమో ఆ వృత్తులను నేర్పిస్తుంది. నేను టైలరింగ్‌లో డిప్లొమా తీసుకున్నాను. నాతో పాటు మరిద్దరికి కూడా కుట్టు వచ్చును. మేము ముగ్గురము రెడీమేడ్ షాపులకు బట్టలు కుట్టి పంపిస్తుంటాం. ఆయా బట్టల్ని బట్టి కుట్టినందుకు కూలి ఇస్తారు. ఆ డబ్బంతా మా పేరనే బాంకిలో జమ చేయిస్తుంటుంది ఆంటీ."

"అలా ఎంత కాలం జరుగుతుంది మీకు? ఇక్కడ ఉండడం ఇష్టం లేకపోతే. . .మీకు. . ?. సందేహం వ్యక్తం చేసింది అమ్మాయి.

"బలవంతగా ఉంచే స్వభావం కాదు ఆంటీది' ఎవరైనా బయట ప్రపంచంలో బ్రతకాలను కుంటే అందుకు ఆనందంగా అంగీకారం తెలుపుతుంది. ఏదైనా కంపెనీల్లోనో, ఆఫీసులు, బాంకులు వగైరాలాటి వాటిల్లో జాబ్ దొరికితే మనం నిరభ్యంతరంగా వెళ్ళిపోవచ్చు. ఒకవేళ పెళ్ళి చేసుకోవాలనే వాంఛ కలిగితే ఆమెకు నిరభ్యంతరంగా తెలియజేయవచ్చు. ఆమె పెళ్ళి కొడుకుల్ని వెదికి పెళ్ళి చేసి

పంపుతుంది కూడా ఇక్కడకు వచ్చిన తర్వాత, ఇద్దరమ్మాయిలకు పెళ్ళి చేసి పంపించారు కూడా.

"ఆంటీకి పెళ్ళయిందా? ఆమె భర్త ఏం చేస్తుంటారు? ఆంటీ ఇలా పది మందిని చేరదీసి డబ్బు వ్యయం చేస్తుంటే ఆయనకు కోపంగా ఉండదా!"

"వూహూ ఉండదు అసలు ఆంటీని. . " సరళ చెప్పనా మాననా అన్నట్లు తటతటాయిస్తూ ఆగిందో క్షణం.

"ఏయ్ సరూ! మీ కబుర్లు తెమలా? ఆ అమ్మాయిని త్వరగా తెమిలి రమ్మని చెప్పు" లోపలి నుంచి ఆంటీ గొంతు ఖంగుమంది.

"ఆంటీకి కోపం వస్తుంది త్వరగా పద." సరళ హెచ్చరించి త్వరత్వరగా వెళ్ళిపోయింది అక్కడి నుంచి.

'నేను ఇంట్లో నుంచి పారిపోయి వస్తున్నట్లు ఆంటీకి ఎలా తెలిసిందో' అనుకుంటూ తనూ లోపలికి వెళ్ళింది ఆ అమ్మాయి. అరటి పళ్ళు తిని కాస్త మజ్జిగ త్రాగి పడుకున్నారు. తెల్లవారేసరికి వూపిరివలవని రొంప, దగ్గు, జ్వరంతో మగతగా ఉన్నా బలవంతంగా లేచి కూర్చుంది అమ్మాయి.

"నేను వెళ్ళి పోతాను ఆంటీ" అంది వణికే స్వరంతో.

"ఈ స్థితిలో ఎలా వెళతావమ్మాయీ! మీ వాళ్ళ అడ్రసివ్వు—ఎవరినైనా పంపిచి పిలిపిస్తాను" అంది ఆంటీ ఆ అమ్మాయి వైపు సానుభూతిగా చూస్తూ.

ఆ అమ్మాయి మాట్లాడలేదు, కాని మనసులో గొణుక్కుంది విసుగా ' 'ఎన్నాళ్ళో ఈ బంధిఖానా'అని.

" మీ వాళ్ళ అడ్రసివ్వడం నీకు ఇష్టం లేకపోతే పోనీలే, రేపటికి తగ్గితే వెళ్ళువుగానిలే" అని, కాఫీ తీసుకోమని ఒక మాత్ర ఇచ్చి వెళ్ళిపోయింది ఆంటీ.

ఆ మాత్ర మహత్యమో, లేక వంతవల్లోగాని ఆ అమ్మాయి రోజంతా అలాగే కళ్ళు మూసుకుని మగతగా పడి ఉంది, అటువంటి రోజులు నాలుగు గడిచాయి. ఆ రోజే కాస్త జ్వరం తగ్గి లేచి కూర్చుంది ఆ అమ్మాయి, "ఆకలిగా ఉంది" అంటే కాస్త చారూ అన్నం పెట్టించింది. 'రేపు తప్పకుండా వెళ్ళిపోతాను, ఎవరు ఆపినా ఆగను' అని మనసులోనే ఒక దృఢ నిశ్చయం చేసుకుంది.

నాలుగు గంటల వేళ ఒక చిన్నకారు వచ్చి ఆ గుమ్మం ముందు ఆగింది. దానిలో నుంచి ఒక వృద్ధ దంపతులు, ఒక యువకుడు దిగారు, 'రోహిణీ కుమార్ గారి ఇల్లు ఇదేనా?" అని అడిగి, అదే అని తెలిశాక లోపలికి వచ్చారు. కారు శబ్దానికి తొంగి చూసిన అమ్మాయి ముఖం వాళ్ళని చూస్తూనే వివర్ణమయ్యింది. భయం భయంగా చూడసాగింది వాళ్ళవైపు.

"నా ఉత్తరం అందిందన్నమాట" నవ్వు తూ వాళ్ళని ఎదుర్కొంది ఆంటీ.

"అందబట్టే కదమ్మా ఖంగారుగా వచ్చాము, ఏదీ మా మాధవి?" పెద్దాయన అడుగుతూ ఇక నిలబడలేనట్లు కుర్చీలో చతికిలబడిపోయాడు.

**రచయిత**

**గతానికి మైలు రాళ్ళవంటి వారు రచయితలు.**

**- బల్వర్**

"క్షేమంగా ఉంది కదూ. . .?" వణికే పెదవులతో అడిగింది వృద్ధురాలు.

"మీరు స్థిమితంగా కూర్చోండి బాబుగారూ! మీ అమ్మాయి క్షేమంగా ఉంది." అంతవరకూ చాటు నుంచి చూస్తున్న అమ్మాయి ఇక నిగ్రహించుకోలేక "తాతయ్యా, అమ్మమ్మా" అంటూ వచ్చి ముసలామెను వాటేసుకుంది ఏడుస్తూ.

"నువ్వు బ్రతికే ఉన్నావు కదమ్మా, నీ గురించి వెదికివెదికి, కనిపించక దిగులుతో కృంగిపోతున్నాము కదమ్మా, నీ పరీక్ష పోతే పోయిందిలే, ఇష్టమైతే మళ్ళీ కడుదువుగాని లేదా మానేయి, అంతేగాని మమ్మల్నిలా శిక్షించకమ్మా. మీ అమ్మా, నాన్న పోయినా, నిమ్మల్నే చూసుకుంటూ బ్రతుకుతున్నాము." ముసలామె కన్నీరు కారుస్తూ మాధవిని మళ్ళీమళ్ళీ గుండెలకు హత్తుకోసాగింది.

"ఏమైపోయావో, ఎవరి చేతిలో చిక్కుకున్నావో అని ఎంత తల్లడిల్లి పోయామో! రోహిణీగారి ఉత్తరం వచ్చింది, మీ అమ్మాయి మా ఇంటి దగ్గర ఉంది, వచ్చి తీసుకువెళ్ళవలసి ఉంది' అంటూ, ఆ ఉత్తరం చూడగానే మాకెంతో ఆనందమయ్యింది, ఉన్నపాటున బైలుదేరి వచ్చాము మా అమ్మాయిని మాకుదక్కించినందుకుమీ మేలు ఈజన్మలోతీర్చుకోలేము తల్లీ" పెద్దాయన ఆంటీవైపు కృతజ్ఞతగా చూశాడు.

"నేను మాత్రం ఏం చేశాను, జరిగిబోయే ప్రమాదాన్ని ముందే గ్రహించాను. కనుక మీ అమ్మాయిని మీకు సురక్షితంగా అప్పజెప్పగలుగుతున్నాను. అదీ ఎలా తెలుసుకున్నాను అనే సందేహం మీకు రావచ్చు, తను చేతి పుస్తకం అక్కడ పెట్టి లావెట్రీలోకి వెళ్ళింది. యదాలాపంగా తీసి ఆ పుస్తకం తిరగేస్తుంటే, పోస్టు చేయని కవరు కనిపించింది. మొదట ఆ కవరు తీయాలని అనుకోలేదు, కాని అమ్మాయి ధోరణి కాస్త విచిత్రంగా కనిపించి ఎందుకైనా మంచిదని తీసి చదివితే కొంత తెలుస్తుంది కదా' అని ఆ కవరు తీసి నా దగ్గర దాచాను. దాన్ని లావెట్రీలోకి వెళ్ళి ఆ లైటు వెలుతురులో చదివాను. నా గుండె జల్లుమంది భయంతో, ఆ అమ్మాయి చేసుకున్న నిర్ణయం గ్రహించి, ఈ వయసులో ఉన్న పిల్లలకు ఆలోచన తక్కువ ఆవేశం ఎక్కువ, ఆ కోపోద్రేకంతో తాము ఏం చేసేది, చేస్తున్నదీ గ్రహించలేరు, గ్రహించబోయేసరికి పరిస్థితి చేయి దాటి పోతుంది, కొన్ని సంవత్సరాల క్రితం నేను కూడా సరిగ్గా ఇదే వయసులో ఇలా తొందరపాటుతో ఇల్లు విడిచిపెట్టాను, నా ఉద్దేశం నా మరణంవల్ల మా వాళ్ళకు అవమానం రాకూడదని కాని నేను వూహించినట్లుగా జరగలేదు, నేను ఒక మనిషి చేతిలో చిక్కాను. అప్పుడు తెలుసుకున్నాను, ఇల్లు విడిచిన ఆడపిల్ల ఎన్ని ఇక్కట్ల పాలవుతుందో. అక్కడి నుంచి తప్పించుకోవాలని చాలా ప్రయత్నించాను. తిండి తినకుండా రోగం తెచ్చుకున్నాను. డాక్టరు దగ్గరకు తీసుకువెళితే నాకు ఏ రోగమూ లేదనీ, ఆ మనిషి చేతుల్లో నుంచి తప్పించమని ఏడిచాను, ప్రాధేయపడ్డాను. అయినా ఆ డాక్టరు తన నిస్సహాయతను బయట పెట్టాడేగాని, నన్ను తప్పించడానికి మాత్రం ఒప్పుకోలేదు" నీ ఒక్క దానివల్ల, నన్నూ, నా కుటుంబాన్ని నాశనం చేసుకోలేను." అని నిక్కచ్చిగా చెప్పేశాడు. పోనీ 'చావడానికైనా మందు ఇమ్మని బ్రతిమాలుకున్నాను, అతను వినలేదు. మా సంభాషణంతా ఒక పేషంటు విన్నారు, అతను ప్రాణాలకు తెగించి సాహసం చేయబట్టే ఆ నరకంలో నుంచి బయట పడ్డాను. ఎలా తప్పించాడో తెలుసా? నలుగురు కుర్రాళ్ళకి పోలీసు యూనిఫారమ్ వేయించి, తను ఎస్సైగా వచ్చి రెయిడ్ చేశారు. నన్ను కాపలా కాస్తున్న వస్తాదులు పారిపోయారు, డాక్టరు భయంతో బిగిసిపోయాడు. ఎస్సయ్ నన్ను పోలీసులకు అప్పజెప్పి, "పదు పోలీస్ స్టేషన్‌కి" అంటూ బైటకు లాక్కువచ్చారు. ఆయన పేరేమో కుమార్, నా ప్రాణాలు కాపాడిన కుమార్‌గారికి ఏమివ్వగలను, ఏమిస్తే ఋణం తీరుతుంది. ఆయన నన్ను భార్యగా స్వీకరించి, నాకు ఒక హోదా కల్పించారు. అందరూ నాలాంటి అదృష్టవంతులులే ఉండరు. అందుకే ఇల్లు విడిచి వచ్చిన అమ్మాయిలకు ఏదో విధంగా రక్షణ కల్పిస్తున్నాను. వీలైతే వాళ్ళవాళ్ళకి అప్పజెప్తున్నాను. మీఅమ్మాయి కూడా అదే తొందరపాటుతో అడుగువేయబోతున్నదని గ్రహించాను, బెదిరించి నచ్చి మాటలతో నా వెంబడి తీసుకువచ్చాను, మీకు ఉత్తరం రాసినప్పటి నుంచీ, 'అది మీకు అందిందో లేదో, అసలు ఆ అడ్రసు రైటో కాదో, మీరు వస్తారో, రారో అని ఈ క్షణం వరకూ భయపడుతూనే ఉన్నాను. మీరు వచ్చారు, మీ అమ్మాయిని మీకు అప్పజెప్తున్నాను" అని, మాధవి వైపు తిరిగి చూస్తూ "చూడమ్మా, మాధవీ! తొందరపాటుతో మరెప్పుడూ ఇటువంటి నిర్ణయం చేసుకోకు, నీవు నీ మానాన్న పోయినా, నీ వెనకాల నిన్ను గురించి ఎంతో అల్లంగా, నీచమైన కథలను సృష్టిస్తుందీ లోకం అవి వినలేక, బాధతో కృంగిపోవడమే మీ పెద్ద వాళ్ళకు నీ వల్ల లభించే ప్రతిఫలం తెలుసా" అందామె నవ్వుతూ మెత్తగా

మాధవి, సిగ్గుతో, అవమానంతో ముఖాన్ని కందిపడ్డలా చేసుకుంది కాని మాట్లాడలేదు.

"వెళ్ళి వస్తాం తల్లీ, ఎప్పుడైనా రావాలని అనిపిస్తే మా వూరు రండి' అని తన అడ్రస్ ఉన్న కార్డు ఇచ్చి వాళ్ళు వెళ్ళి కారులో కూర్చున్నారు.

"నన్ను క్షమించు ఆంటీ! ఇంకెప్పుడూ ఆలోచన లేకుండా ఏదీ చేయను," అని మాధవి, ఆమె కాళ్ళకు, దణ్ణం పెట్టి వెళ్ళి తాను కారులో కూర్చుంది.

కారులో నుంచి వాళ్ళు "వెళ్ళొస్తాం" అన్నట్లుగ చేతులు వూపుతుంటే కారు కదిలి దుమ్ము రేపుకుంటూ ముందుకి దూసుకుపోయింది. ✱